క్లుప్తంగా

వృద్ధురాలి బలవన్మరణం



నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటేశ్వరపురం రైల్వే బ్రిడ్జి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతురాలు సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగి.. నలుపు రంగుపై పసుపు డిజైన్ గల చీర, పసుపు రంగు జాకెట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి మృతురాలి వివరాల కోసం వెంకటేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో ఆరాతీస్తున్నారు.

ప్రమాదభరితంగా..



గుంతలో కర్రలు నిలుపుతున్న స్థానికులు

నెల్లూరు(క్రైమ్): అసలే అంతంతమాత్రంగా రహదారులు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారి గుంతలమయమైంది. పద్మావతి సెంటర్ వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గుంతపడి, వర్షపు నీటితో నిండిపోయింది. రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో గుంతలో కర్రలను నిలిపి ప్రమాదాలు జరగకుండా స్థానికులు చర్యలు చేపట్టారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య




మనుబోలు : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నాయుడుపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గొట్లపాళెం గ్రామానికి చెందిన వెందోడు శీనయ్య(35)కు ఐదేళ్ల క్రితం అనూషతో వివాహమైంది. మొదట్లో వారి కాపురం సజావుగానే సాగినప్పటికీ ఇటీవల కాలంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వారి మధ్య మరోసారి గొడవ జరగడంతో నాయుడుపల్లి సమీపంలోని బండేపల్లి బ్రాంచ్ కాలువ వద్దకు శీనయ్య వెళ్లి తెగుళ్ల నివారణకు వాడే గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రాకేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శీనయ్యకు భార్య అనూషతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

సురక్షిత ప్రాంతంలో వైద్య పరీక్షలు

కొడవలూరు : సురక్షిత ప్రాంతంలో ఆశ్రయం పొందుతున్న గిరిజనులకు కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. భారీ వర్షాల దృష్ట్యా నార్తురాజుపాళెంలోని వినాయక నగర్ గిరిజన కాలనీ వాసులను అధికారులు స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు సోమవారం తరలించడం తెలిసిందే. ఈ క్రమంలో ఆశ్రయం పొందుతున్న గిరిజనుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారి ఎం.రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. జ్వరాలు, తదితర సీజనల్ వ్యాధులున్నాయా.. అని పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత కేంద్రంలోని గిరిజనులంతా ఆరోగ్యకరంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఏ సుధాకర్, ఏఎన్‌ఎంలు దీనమ్మ, సలోమి, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ పాల్గొన్నారు.

జాన్‌పేటలో నేత్రదానం



ఎల్లు వెంకయ్య (ఫైల్)

విడవలూరు : మండలంలోని జాన్‌పేట గ్రామంలో ఎల్లు వెంకయ్య(52) మంగళవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల కోరిక మేరకు మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సమక్షంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ వారికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ వేణు ఆయన నేత్రాలను సేకరించారు.

వైర్‌లెస్ సెట్ల మూగనోము

- పట్టించుకోని అధికారులు
- నిర్వహణకు నిధుల కేటాయింపులో అలసత్వం
- తుఫాన్ల సమయంలో ఈ సేవలు ఎంతో కీలకం



వైర్‌లెస్ సెట్

నెల్లూరు (పొగతోట): టెలిఫోన్.. రవాణా.. ఇలా అన్ని వ్యవస్థలూ నిర్వీర్యమైన సమయంలో ప్రజలకు అత్యవసర సమాచారాన్ని చేరవేసే వైర్‌లెస్ సెట్లు మూగబోయాయి. తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు.. సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు.. సమాచార సేకరణకు గతంలో ఇవి ఎంతో కీలకంగా పనిచేసేవి. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఇవి ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

నిర్వహణకు నిధులేవీ..?

నిర్వహణ నిమిత్తం ఏడాదికి రూ.ఐదు లక్షలు కేటాయించలేని కారణంగా ఇవి పనిచేయకుండా మండల కేంద్రాల్లో దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని 37 మండలాల్లో తీర ప్రాంత మండలాలున్నాయి. భారీ వర్షాలు, తుఫాన్లతో రోజుల తరబడి విద్యుత్ అంతరాయం తలెత్తిన సందర్భాల్లో జిల్లా స్థాయి అధికారుల నుంచి వచ్చే సమాచారాన్ని చేరవేయడంలో విఫలమవుతున్నారు.

గతంలో ఎంతో ప్రాధాన్యం

సెల్‌ఫోన్లు రాని కాలంలో తుఫాన్లు, భారీ వర్షాల సమయాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశంలో జిల్లా కేంద్రం నుంచి మండల, గ్రామ కేంద్రాలకు సమాచారాన్ని చేరవేయడంలో వైర్‌లెస్ సెట్లు ఎంతో కీలకంగా పనిచేశాయి. అలాంటి ఈ వ్యవస్థ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. గతంలో ప్రతి మండల కేంద్రంలో వైర్‌లెస్ సెట్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించారు. అయితే వీటి నిర్వహణకు నిధులను ప్రస్తుతం కేటాయించకపోవడంతో మూలనపడ్డాయి. ఏడాదికి రూ.ఐదు లక్షలను వెచ్చిస్తే వీటి నిర్వహణ సక్రమంగా జరిగేందుకు అవకాశం ఉంటుంది. జిల్లా అధికారులు ఇప్పటికైనా స్పందించి వీటిని వినియోగించులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనిచేస్తున్నాయి

వైర్‌లెస్ సెట్లు పనిచేస్తున్నాయి. ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నాం. వీటిని సక్రమంగా వినియోగించేలా దృష్టి సారిస్తాం.

– లవన్న, జిల్లా రెవెన్యూ అధికారి

పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు



చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, అన్ని సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. కార్పొరేషన్ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, పారిశుధ్యం తదితర సదుపాయాలను కల్పించేలా అన్ని చర్యలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. నగరంలో కాలువల పూడికతీత పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నగరంలోని పెద్ద హోర్డింగ్‌లను టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించి ప్రమాదకర స్థితిలో ఉన్న వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కాలువలపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను అవసరమైన చోట జేసీబీ సాయంతో పగలగొట్టి వర్షపు నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకుల్లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యుత్ అధికారులను సమన్వయం చేసుకుంటూ చెట్లు, కొమ్మలను తొలగించాలని సూచించారు.

ఎన్జీఓ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (పొగతోట): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా కార్యవర్గంలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎన్నికల ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. నగరంలోని ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి వ్యవహరించారు. జిల్లా కార్యదర్శిగా గాదిరాజు రామకృష్ణ, కోశాధికారిగా ప్రసాద్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లక్కాకుల పెంచలయ్య, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, సతీష్ బాబు, సంయుక్త కార్యదర్శిగా కృష్ణకుమార్‌ను ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షుడు ఆంజనేయవర్మ, జిల్లా ఉపాధ్యక్షులు కరుణమ్మ, మధు, కృష్ణంరాజు, శ్రీధర్, నేతలు గిరి, విజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న దివ్య

నెల్లూరు(అర్బన్): చేతులను శుభ్రపర్చుకుంటే వ్యాధులు దరిచేరవని అలెన్ రాయల్ దంత వైద్యశాల డాక్టర్ విద్య పేర్కొన్నారు. పొదలకూరు రోడ్డులోని శేషయ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం చేతుల శుభ్రతపై డెమో ఇచ్చారు. సెట్నెల్ సీఈఓ శ్రీనివాసరావు, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, నేతలు మహబూబ్‌బాషా, వెంకటేశ్వర్లు, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెన్నెముక సమస్యలపై అవగాహన అవసరం

నెల్లూరు(అర్బన్): వెన్నెముక సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రి న్యూరోసర్జన్ గంగపట్నం దినేష్ పేర్కొన్నారు. ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 15 శాతం మంది ప్రజలు వెన్నెముక సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. మంచి అలవాట్లు పాటించడం, తగిన వ్యాయామం చేయడం ద్వారా సమస్యలకు దూరంగా ఉండొచ్చని పేర్కొన్నారు.

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా రాములునాయక్ బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు.

మృతుడు గూడూరు వాసిగా గుర్తింపు

నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని గూడూరు వాసిగా పోలీసులు గుర్తించారు. గూడూరుకు చెందిన రియాజ్ (50) ధనలక్ష్మీపురం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

ఎడతెరపి లేని వర్షం



వీఆర్సీ కూడలిలో జోరుగా కురుస్తున్న వర్షం

నెల్లూరు(బారకాసు): నగరంలో మంగళవారం సైతం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతోంది. కాలువల్లో రాళ్లను జేసీబీల సాయంతో తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కాలువలపై ఉన్న ర్యాంపులు, మెట్లను పగలగొట్టి నీరు సక్రమంగా ప్రవహించేలా చూస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, ముత్తుకూరు గేట్, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

- మన్సూర్‌నగర్, శివాజీనగర్ సచివాలయ పరిధిలోని ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, దివ్యాంగుల ఐక్య సంఘ అధ్యక్షుడు సనావుల్లా, జక్కావుల్లా, ఉపాధ్యాయులు ఆసిఫా, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే



నెల్లూరు(అర్బన్): గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ హరీష్, డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ్‌కాంత్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ సతీష్, చీఫ్ ఇన్‌ఫెక్షన్ కంట్రోలర్ లావణ్య, ఆపరేషన్స్ హెడ్ రామారావు, ఏజీఎం శేఖర్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీవాణి, కాంత, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ నేతకు పరామర్శ



నెల్లూరు(బారకాసు): నగరంలోని 47వ డివిజన్ కుక్కలగుంటకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత క్రాంతి కుమారుడు మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయానికి ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జిల్లాను ముంచెత్తుతున్న వర్షాలు

- సరాసరిన 94.8 మిల్లీమీటర్ల వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో వర్షాలు మంగళవారం కొనసాగాయి. జిల్లాలో సరాసరిన 94.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అత్యధికంగా జలదంకి మండలంలో 173 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. విడవలూరులో 153, అల్లూరులో 149, కావలిలో 139.6, బోగోలులో 131.4, కొడవలూరులో 127.4, సంగంలో 125.4, కందుకూరులో 121.2, బుచ్చిరెడ్డిపాళెంలో 115.2, ఉలవపాడులో 113.8, అనంతసాగరంలో 111.4, దగదర్తిలో 106.4, చేజర్లలో 105.6, కలిగిరిలో 102.6, వెంకటాచలంలో 98.6, గుడ్లూరులో 97.4, ఇందుకూరుపేటలో 95.8, నెల్లూరు అర్బన్‌లో 91.6, కలువాయిలో 89.2, మనుబోలులో 87 మిల్లీమీటర్ల వర్షం పడింది. లింగసముద్రంలో 87, ఆత్మకూరులో 81.2, నెల్లూరు రూరల్‌లో 80.6, ముత్తుకూరులో 78, వలేటివారిపాళెంలో 77.4, సైదాపురంలో 76.6, ఏఎస్‌పేటలో 74.2, పొదలకూరులో 70.6, కొండాపురంలో 65.8, మర్రిపాడులో 63.6, రాపూరులో 61.6, వరికుంటపాడులో 49.8, ఉదయగిరిలో 49.6, దుత్తలూరులో 49.6, సీతారామపురంలో 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏ అవసరమొచ్చినా సహకారం అందిస్తాం

నెల్లూరు(బారకాసు): జిల్లాకు వాయుగుండం ముప్పు అధికంగా ఉంటుందనే అధికారుల హెచ్చరికలతో ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని, ఏ అవసరమొచ్చినా తాము అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరమైతే 92481 88888, 89854 73483 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ

నెల్లూరు (టౌన్): రాష్ట్రస్థాయిలో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సర్వేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంయుక్త ద్వితీయ స్థానాన్ని సాధించారు. పొదలకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సుమన్, సాయిచరిత, తేజస్విని, సృజన కన్సొలేషన్ బహుమతులను దక్కించుకున్నారు. వీరిని డీఈఓ రామారావు, సమగ్రశిక్ష ఏపీఓ ఉషారాణి అభినందించారు.

సేవలందించేందుకు సిద్ధంగా ఉండండి

నెల్లూరు(బారకాసు): జిల్లాకు భారీ వర్ష సూచనతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి, అవసరమైన సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తనతో పాటు జిల్లా స్థాయి పార్టీ నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్య నేతలు తదితరులు అందుబాటులో ఉండి అవసరమైన చోట అధికారులతో మాట్లాడి అన్ని రకాల చర్యలు చేపడతారని వివరించారు. జిల్లా ప్రజలకు ఏ అవసరమొచ్చినా పార్టీ కార్యాలయ 87126 03258 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నమ్మించి.. రూ.1.16 కోట్లు కాజేసి

నెల్లూరు(క్రైమ్): స్కీమ్ పేరిట నమ్మించి రూ.1.16 కోట్లను కాజేసిన వ్యక్తిపై కేసును బాలాజీనగర్ పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్‌కు చెందిన ప్రశాంతి విశ్రాంత షార్ ఉద్యోగి. రిటైర్మెంట్‌లో వచ్చిన నగదును కుటుంబసభ్యుల పేర్లపై డిపాజిట్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రామలింగాపురంలోని ఓ లైఫ్ ఇన్సురెన్స్ కార్యాలయంలో పనిచేస్తున్న హనుమంతరావును 2016లో సంప్రదించారు. ఆయన సూచనల మేరకు తన కుటుంబసభ్యుల పేర్లపై పలు దఫాలుగా రూ.1.16 కోట్లను డిపాజిట్ చేశారు. డిపాజిట్‌కు సంబంధించి 2021 వరకు ప్రతి నెలా వడ్డీ వచ్చింది. అనంతరం ఆగిపోయింది. పలుమార్లు హనుమంతరావును సంప్రదించగా, కాలయాపన చేస్తూ వచ్చారు. చివరికి ఆమె బ్యాంక్‌కు వెళ్లి విచారించగా, వారి పేర్లపై ఎలాంటి డిపాజిట్లు, స్కీమ్‌లు లేవని తేలింది. నగదును హనుమంతరావు కాజేశారని గ్రహించిన ఆమె నిలదీయగా, త్వరలో ఇస్తానని నమ్మిస్తూ వచ్చారు. ఎంతకీ నగదు ఇవ్వకపోవడంతో పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.